## క్లుప్తంగా

### అధికారులపై చర్యలకు మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**జైపూర్:** పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ విషయంలో ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కొన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంపీ వంశీకృష్ణను ఆహ్వానించలేదని, ప్రొటోకాల్ పాటించకుండా అవమానపరుస్తున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, మాజీ సర్పంచులు పండుగ రాజన్న, గోనె నర్సయ్య, మాలమహానాడు చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శీలం వెంకటేశ్, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే

**లక్సెట్టిపేట:** మున్సిపాలిటీ పరిధిలోని 5, 12వ వార్డులలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరీఫ్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించేందుకు సర్వే చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింత అశోక్, నవాబ్‌ఖాన్, రియాజ్, శ్రీకర్, రవీందర్, అమీర్, జకీర్ పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

**తాండూర్:** మండలంలోని అచ్చులాపూర్, రేచిని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ జ్యోత్స్న తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని అధికారులకు సూచించారు. ఆమె వెంట గిర్దావర్ ఎజాజుద్దీన్ ఉన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

**బెల్లంపల్లి:** పూలే పెరియార్ అంబేద్కర్ ఆలోచన వేదిక బెల్లంపల్లి పట్టణ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జీఏ జ్యోతికుమార్, సలహాదారులుగా ఏ.కనకయ్య, అధ్యక్షుడిగా గొడిసెల శ్రీహరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొడిసెల స్వామి, ఉపాధ్యక్షులుగా అక్కు ఉమ, దుబాసి రవి, ప్రధాన కార్యదర్శిగా రంగ ప్రశాంత్, సహాయ కార్యదర్శులుగా అక్కు కృష్ణ, లింగంపల్లి రాజన్న, సంయుక్త కార్యదర్శిగా ఉంద్రాల రవి, ప్రచార కార్యదర్శులుగా గొడిసెల చంద్రమౌళి, జంజర్ల రవిరాజ్, కోశాధికారిగా డీఆర్ శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 18 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

### భీమారంలో బీఆర్‌ఎస్ నేతల అరెస్ట్

**భీమారం:** రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భీమారం పర్యటన నేపథ్యంలో మంగళవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్‌తో పాటు నాయకులు దాసరి మధునయ్య, ఆత్కూరి రాము, దాసరి గోపాల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మంత్రి పర్యటన అనంతరం వారిని వదిలిపెట్టారు.

### హనుమాన్ నగర సంకీర్తన వేడుకలు



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మారుతి దేవాలయం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హనుమాన్ నగర సంకీర్తన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వీధుల్లో భజన గీతాలు, నృత్యాలు, కోలాటాలతో శోభాయాత్ర సాగింది. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. జైరాం నినాదాలతో హోరెత్తించారు.

### జిల్లా కార్యవర్గం ఎన్నిక

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** ఆర్‌ఎంపీ, పీఎంపీల జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం మంచిర్యాలలోని ఆర్‌ఎస్‌ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొద్దుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చుంచు శంకర్‌వర్మ, కోశాధికారిగా బైరి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య సలహాదారుడు నూతి ధనుంజయ, కో ఆర్డినేటర్ ప్రకాశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# లెక్కలేని తైబజార్ వసూలు!

- సీరియల్ నంబర్లు లేకుండా రశీదులు
- నాలుగేళ్లుగా వేలంపాటలు కరువు
- పట్టించుకోని అధికారులు



సీరియల్ నంబర్ లేకుండా వాహనదారునికి ఇచ్చిన రశీదు

**చెన్నూర్:** చెన్నూర్ మున్సిపాల్టీలో తైబజార్ వసూళ్లలో లెక్క లేకుండా వ్యవహరిస్తున్నారు. వ్యాపారులు, వాహనదారులు, కూరగాయల మార్కెట్ వ్యాపారుల నుంచి రుసుం వసూళ్లలో అక్రమ దందాకు తెరలేపారు. మున్సిపాల్టీ నుంచి వ్యాపారులకు ఇచ్చే రశీదులపై ఎలాంటి సీరియల్ నంబర్లు లేకపోవడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో రోడ్ల వెంట చిరువ్యాపారులు, ఇతర ప్రాంతాల నుంచి సరుకులు తీసుకొచ్చే వాహనాలు, కూరగాయలు విక్రయించే వ్యాపారుల నుంచి మున్సిపాల్టీ వ్యాపార రుసుం వసూలు చేస్తోంది. రోజువారీగా ఒక్కో వ్యాపారానికి ఒక్కో విధంగా ధర నిర్ణయించి వసూలు చేస్తుంటారు. గతంలో మున్సిపల్ అధికారులు తైబజార్ రుసుం వసూలు కోసం బహిరంగ వేలం నిర్వహించగా.. ఏడాదికి రూ.7లక్షలకు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 2020లో చెన్నూర్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ తైబజార్‌ను వేలంలో దక్కించుకున్నారు. సదరు కాంట్రాక్టర్ మున్సిపాల్టీకి వేలం డబ్బులు చెల్లించకుండా ఎగనామం పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు వేలంపాటలు నిర్వహించినా కాంట్రాక్టర్లు రావడం లేదు. దీంతో తైబజార్ వసూలు బాధ్యతను అధికారులు మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. రోజువారీగా వ్యాపారులు, వాహనదారుల నుంచి వసూలు చేసిన సొమ్మును అధికారులకు అప్పగిస్తున్నారు. నిబంధనల ప్రకారం రుసుం వసూలు చేసే వ్యక్తికి సీరియల్ నంబరు ఉన్న రశీదు బుక్కును అప్పగించాల్సి ఉంటుంది. సీరియల్ నంబర్లు ఉన్న రశీదులతోనే వ్యాపారుల నుంచి రుసుం వసూలు చేయాలి. కానీ సీరియల్ నంబర్లు లేని రశీదులు ఇచ్చి రుసుం వసూలు చేస్తున్నారని పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఓ వాహనదారుడు చెన్నూర్‌కు సరుకులు తీసుకొచ్చాడు. మున్సిపల్ సిబ్బంది ఒకరు వాహనదారుకు రూ.100 విలువైన రశీదు ఇచ్చి డబ్బులు తీసుకున్నాడు. రశీదుపై సీరియల్ ఎందుకు లేదని వాహనదారు ప్రశ్నించగా.. సమాధానం చెప్పకుండా సిబ్బంది అక్కడి నుంచి జారుకున్నాడు. మంగళవారం పట్టణంలోని ఓ వ్యాపారి నుంచి రూ.50 వసూలు కోసం రశీదు ఇచ్చారు. దీనిపైనా నంబరు లేకపోవడంతో అనుమానం వచ్చి ప్రశ్నించగా.. నంబరు ఉన్న రశీదు ఇవ్వడం గమనార్హం. వసూలు చేసే వ్యక్తి వద్ద రెండు రశీదులు ఉండడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులు విచారణ చేపడితే రుసుం వసూళ్లలో ఏం జరుగుతుందో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### సీరియల్ నంబర్ ఉంటుంది..

తైబజార్ రుసుం వసూలు కోసం ఇచ్చే రశీదులపై నంబరు ఉంటుంది. నంబర్ లేకుండా రశీదులు ఇవ్వం. నంబర్లు లేని రశీదుల విషయం నా దృష్టికి రాలేదు. వసూళ్లలో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు ఈ నెల 27న తైబజార్ వేలంపాట నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేస్తాం.

– మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్, చెన్నూర్

## ‘అబద్ధపు హామీలపై నిలదీస్తే కేసులా?’



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

**జన్నారం:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై నిలదీసిన బీఆర్‌ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్ నాయక్‌పై కేసులు నమోదు చేయడం ఏమిటని మాజీ వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్ ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడినా నియోజకవర్గ ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న జాన్సన్ నాయక్‌పై పెట్టిన అక్రమ కేసుపై ఉన్న శ్రద్ధ ప్రజలకు ఇచ్చిన హామీలపై పెడితే బాగుంటుందని సూచించారు. ఇలాంటి కేసులు నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులపైన పెట్టుకున్నా మా పార్టీ నాయకుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు భరత్‌కుమార్, మున్వర్ అలీఖాన్, ఫజల్‌ఖాన్, ప్రసాద్ నేత, జాడి గంగాధర్, ప్రభుదాస్, సృజన్, తదితరులు పాల్గొన్నారు.

## మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**కాసిపేట:** మండలంలోని సోమగూడెం చౌరస్తాలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజుల క్రితం కాసిపేట మండలంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటం దగ్ధం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఏసీపీకి విన్నవించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకట కృష్ణ, కాసిపేట మండలాధ్యక్షుడు సూరం సంపత్ కుమార్, నాయకులు పులుగం తిరుపతి, కోయల్కార్ గోవర్ధన్, శ్రీకృష్ణ దేవరాయలు, కోడి రమేశ్, రాచర్ల సంతోష్, గజ్జెల్లి రాజ్‌కుమార్, ధార కళ్యాణి, దూడపాక భరత్, కొంక సత్యనారాయణ పాల్గొన్నారు.

## అయ్యా.. కొడుకులు పట్టించుకోవడం లేదు

- పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు



కుమారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కుమారస్వామి

**భీమిని:** ఆస్తులు పంచుకున్న కుమారులు రెండేళ్లుగా తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదు. దీంతో న్యాయం చేయాలంటూ వృద్ధ దంపతులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. మండలంలోని మల్లిడి గ్రామానికి చెందిన రామయ్య, భూమక్క దంపతులకు కుమారులు రాజయ్య, భూమయ్య, తిరుపతి, శ్రీనివాస్, సతీష్ ఉన్నారు. ఆస్తులు పంచుకున్న కుమారులు రెండేళ్లుగా తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదు. దీంతో సోమవారం రామయ్య, భూమక్క పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్సై విజయ్‌కుమార్ మంగళవారం మల్లిడి గ్రామానికి వెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో కుమారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆస్తులే ముఖ్యం కాదు.. అమ్మానాన్నలను చూసుకోవడం అంతకంటే ముఖ్యమని సీఐ హితవు పలికారు. తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని, లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బోధన సామర్థ్యం మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో తిరుపతిరెడ్డి

**లక్సెట్టిపేట:** ఉపాధ్యాయులు శిక్షణలో బోధన సామర్థ్యం మెరుగుపర్చుకోవాలని ఎంఈవో శైలజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల ఐదురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అభ్యసన సామర్థ్యం పెంచేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీ పింగిళి వేణుగోపాల్, బండ శ్రీనివాస్, తిరుపతి, శ్రీనివాస్, రవీందర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**జన్నారం:** విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జన్నారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల విద్యాధికారి విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులందరూ అన్ని అంశాలను విపులంగా నేర్చుకోవాలని సూచించారు.

**భీమారం:** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈవో వేణుగోపాల్ ప్రారంభించారు. సీఆర్పీ సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వేమనపల్లి:** రేజింగ్ తెలంగాణలో భాగంగా ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు గణిత సామర్థ్యాల సాధన (ఎఫ్‌ఎల్‌ఎన్)పై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామి, రిసోర్స్ పర్సన్‌లు శంకర్, వినయ్‌కుమార్, సంతోష్, మహేందర్, శ్రీధర్, శ్రీకాంత్, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**జైపూర్:** మండలంలోని కేజీబీవీలో మంగళవారం మండల విద్యాధికారి శ్రీనివాస్ గణిత సామర్థ్యాల సాధనపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ తిరుమలేశ్, పోశెట్టి రాజేందర్, లలిత, కవిత, రజిత, హైమవతి, రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రాథమిక పాఠశాలల్లోని ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు 5 రోజుల వృత్యాంతర శిక్షణ ప్రారంభమైంది. హాజీపూర్ ఎంఈఓ తిరుపతిరెడ్డి, సబ్బేపల్లి, ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధారాణి, గణపతిరెడ్డి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## కార్మికులకు ఇన్సెంటివ్ కల్పించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

**శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని కార్మికులకు ఇన్సెంటివ్ కల్పించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా డిమాండ చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ కాస్ట్ గని, సీహెచ్‌పీలను అడ్మినిస్ట్రేషన్ ప్రకారం కలిపి ఉంచడం వలన కార్మికులకు ఇన్సెంటివ్ రావట్లేదని, ఈ రెండింటి కోడ్‌లను వేరు చేస్తేనే ఇన్సెంటివ్ వర్తిస్తుందన్నారు. దీనిపై గత స్ట్రక్చర్ సమావేశంలో యజమాన్యాన్ని ఒప్పించినా అమలు కావకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు చంద్రమోహన్, నాగభూషణ్, బద్రి బుచ్చయ్య, నాయకులు గండి సతీశ్, సుధాకర్, సత్తయ్య, రాజమౌళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హనుమాన్ భక్తుల రామయజ్ఞం



రామయజ్ఞం చేస్తున్న హనుమాన్ భక్తులు

**జన్నారం:** మండలంలోని కలమడుగులో మంగళవారం హనుమాన్ దీక్షాపరులు రామయజ్ఞం చేశారు. ఉదయాన్నే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రామనామ స్మరణతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ దీక్ష పూర్తవుతున్నందువల్ల దీక్షలో భాగంగా రామయజ్ఞం చేసినట్లు భక్తులు పేర్కొన్నారు.

**నస్పూర్:** పట్టణ పరిధిలోని సీసీసీ టౌన్‌షిప్ శ్రీ రామ భక్తాంజనేయ ఆలయంలో మంగళవారం శ్రీరామ సహిత హనుమత్ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు దేవరాజు రంజిత్ శర్మ, ముస్త్యాల మహేశ్ వర్మ, ముస్త్యాల కిషన్ శర్మ, హర్షవర్ధన్ శర్మ, స్వయం భట్ల రవి శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, మాలధారణ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

**మంచిర్యాలఅర్బన్:** పట్టణంలోని తిలక్‌నగర్ హనుమాన్ టెంపుల్‌లో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం హనుమాన్ దీక్షాపరులు భక్తి శ్రద్ధలతో పఠించారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సుమారు 100 మంది హనుమాన్ దీక్షాపరులు, భక్తులతో పాటు మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పాల్గొన్నారు.

### భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదు

**చెన్నూర్:** కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేదిలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నూర్ మండలం కిష్టంపేట వైజంక్షన్, కోటపల్లి మండలం పారుపల్లి జాతీయ రహదారిలో ఆటవీ శాఖ ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాలను వెంటనే తొలగించాలని మంచిర్యాల డీఎఫ్‌వో చెప్పాడం జరిగిందన్నారు. గతంలో టోల్‌ప్లాజాలో భారీ వాహనాలకు మాత్రమే టోల్ టాక్స్ వసూలు చేస్తామని చెప్పిన ఆటవీశాఖ అధికారులు ఇప్పుడు హైవేలపై వసూలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ఫారెస్ట్ ఉన్నతాధికారులు స్పందించి టోల్‌ప్లాజా వసూళ్లు నిలిపివేసి గేట్లు తొలగించాలని డిమాండ్ చేశారు.

### ‘వాల్టా’ అథారిటీ సభ్యుడిగా యోగేశ్వర్



నియామకపత్రం అందుకుంటున్న యోగేశ్వర్

**నస్పూర్:** నీటి వనరులు, నేల, చెట్లు, పర్యావరణ సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాల్టా చట్టం అథారిటీ మండలిలో సభ్యుడిగా మంచిర్యాల జిల్లా నస్పూర్ వాసి గుండేటి యోగేశ్వర్‌కు ప్రభుత్వం చోటు కల్పించింది. మంగళవారం సచివాలయంలో మంత్రి సీతక్క ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన రాష్ట్ర స్థాయి ప్రత్యేక సమావేశంలో వాల్టా చట్టం విజయవంతంగా అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

## వివాదాస్పద భూముల్లో జాయింట్ సర్వే



పోలంపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

**భీమారం:** మండలంలోని పోలంపల్లి శివారులోని సర్వే నంబర్ 292, 384లో గల వివాదాస్పద భూముల్లో మంగళవారం అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు జాయింట్ సర్వే చేపట్టారు. ఈమేరకు అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌తోపాటు రెవెన్యూ అధికారులు గ్రామస్తుల సమక్షంలో సర్వే ప్రారంభించారు. ఈ సర్వే మూడు రోజుల పాటు నిర్వహిస్తామని, అనంతరం భూములు ఎవరివి అనేది తేలుతుందని రేంజ్ ఆఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి శ్రీనివాస్, మండల సర్వేయర్ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన బదిలీ విధానం రద్దు చేయాలి

**బెల్లంపల్లి:** సింగరేణి యాజమాన్యం కొత్తగా తీసుకువచ్చిన నూతన బదిలీ విధానం బేషరతుగా రద్దు చేయాలని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) కేంద్ర కమిటీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ మిట్ట సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మందమర్రి ఏరియా శాంతి ఖని గని కార్మికులు ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడీలు ధరించి నిరసన తెలిపారు. కార్మిక వర్గ ప్రయోజనాలు కాపాడటానికి తోడ్పడాల్సింది పోయి కార్మికులకు ఇబ్బందులు కలిగే విధంగా యాజమాన్యం సర్క్యూలర్‌ను తీసుకు రావడం సరైంది కాదన్నారు. అనంతరం గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఏరియా సెక్రెటరీ కుక్కల ఓదెలు, నాయకులు కస్తూరి కనకయ్య, దేవ రమేశ్, అనిల్ కుమార్ , సదయ్య, రవి కుమార్, వీరమల్లు, శ్యామ్, మాధవరెడ్డి, కుదిరే తిరుపతి, బత్తుల మొగిలి, సుమన్, వెంకటేష్, రవి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**కాసిపేట:** సింగరేణి యాజమాన్యం విడుదల చేసిన నూతన బదిలీ విధానం వెంటనే రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై నూతన బదిలీ విధానం రద్దు చేయాలని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం గని మేనేజర్ భూశంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బన్న లక్ష్మణ్‌దాస్, ఫిట్ సెక్రెటరీ శనిగారపు రవీందర్, నాయకులు సోగాల కన్నయ్య, కనుకుంట్ల దినేష్, సంపత్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జేఏసీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

**మందమర్రిరూరల్:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జేఏసీ నాయకులు మంగళవారం గనులు, డిపార్టుమెంట్లపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం 44 చట్టాలను 4 కోడ్‌లుగా చేయడాన్ని కార్మిక సంఘాల జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సుదర్శన్, ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు నరేందర్, సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు వెంకటస్వామి, జేఏసీ నాయకులు శ్రీనివాస్, రాజేశం, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్:** లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాదారంలో సివిక్ కార్మికులు ఇఫ్టూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్, శకుంతల, ఓదమ్మ, నాందేవ్, పోశక్క, మల్లీశ్వరి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### ఆరోగ్య కేంద్రం తనిఖీ

**జైపూర్:** జైపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత తనిఖీ చేశారు. ప్రసుతి గది, రోగుల వార్డు, ల్యాబ్, వ్యాక్సినేషన్ గది పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

### పండ్లు పంపిణీ

**మంచిర్యాలటౌన్:** ఎన్టీఆర్ జన్మదినం పురస్కరించుకుని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో అమృత హస్తం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మండల తిరుపతి యాదవ్, ఉపాధ్యక్షులు సత్యమూర్తి, రమేశ్, పట్టణ అధ్యక్షులు రత్నాకర్, అనిరుద్, అనిల్ పాల్గొన్నారు.

### ఇటిక్యాల చెరువు సర్వే ప్రారంభం

**లక్సెట్టిపేట:** ఇటిక్యాల చెరువు విస్తీర్ణాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే పనులు ప్రారంభించినట్లు ఇరిగేషన్ ఈఈ ప్రణీత్ తెలిపారు. వివరాలు త్వరలో తెలియపరుస్తామన్నారు.

### ‘దళితులను కించపరుస్తున్న ప్రభుత్వం’

**మందమర్రిరూరల్:** కాంగ్రెస్ ప్రభుత్వం దళిత ప్రజాప్రతినిధులను కించపరిచేలా వ్యవహరిస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ స్టేట్ లీగల్ సెల్ మెంబర్ ఎంవీ గుణ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. దళితుడైన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు ఆహ్వానించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### దరఖాస్తుల స్వీకరణ

**మందమర్రిరూరల్:** కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి పట్టణంలోని సీఈఆర్ క్లబ్ సమీపంలో గల ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్(బీ-1)లో మంగళవారం దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి పట్టణ అధ్యక్ష పదవితో పాటు, వార్డు, మండల, గ్రామ, బ్లాక్ కాంగ్రెస్, క్యాతనపల్లి మున్సిపాలిటీ, వార్డుల అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తులు అందజేశారు.

### రహదారి ఆక్రమణపై ఫిర్యాదు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** గుడిపేట శివారులోని ఊర చెరువు కట్ట రహదారి ఆక్రమణకు గురవుతుందని మంగళవారం కమిషనర్ శివాజీకి స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువు కట్ట రహదారిపైనే గడ్డివాములు, గేదెలు, పేడ కుప్పలు వేసుకుని నడవడానికి వీలు లేకుండా ఆక్రమిస్తున్నారన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకుని రహదారి ఆక్రమణ అరికట్టాలని మల్లేశ్, రమేశ్, తిరుపతి, కిషన్, రాయమల్లు, భూమయ్య, రాజ్‌కుమార్ కోరారు.

### క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం

**తాండూర్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి యువకులకు శిక్షణ ఇస్తున్నారు. నిర్వాహకుడు సంతోష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

### లేబర్ కోడ్ పత్రాలు దహనం

**శ్రీరాంపూర్:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లకు నిరసనగా మంగళవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి డీ బ్రహ్మానందం ఆధ్వర్యంలో కార్మికులు శ్రీరాంపూర్ లోని సివిల్ కార్యాలయం వద్ద లేబర్ కోడ్ పత్రాలను దహనం చేశారు. పోరాటాలతోనే ఈ లేబర్ కోడ్‌లను అడ్డుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. బీ.యాదగిరి, అనిల్, సుధాకర్, రాజేశ్, శారద, కవిత పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన



మాట్లాడుతున్న అధికారి వీరన్న

**వేమనపల్లి:** లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే పత్తి, వరి విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి వీరన్న అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట మార్పిడి , నకిలీ విత్తనాలు, ఆయిల్ పామ్ సాగు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతు పంట కాలం పూర్తి అయ్యేవరకు రశీదులు భద్రపర్చుకోవాలన్నారు. పత్తి విత్తనాలను సరైన సమయంలో విత్తుకోవాలని, నారుమడులను నెల రోజుల ముందుగానే వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రుక్సార్ సుల్తానా, ఎప్సీబా, రైతులు పాల్గొన్నారు.